# విరాగి

" సుఖం ఎక్కడ ఉంది?" రాజు ప్రశ్న.

అతని కొలీగ్సు ఆశ్చర్యంగా చూశారు అతని వంక. అతనికి కొత్తగా పెళ్ళయింది. అందమైన భార్య! మంచి ఉద్యోగంలో ఉన్నాడు. అతను – ఆమె ఆరోగ్యంగా, అందంగా, చూపరులకు కళ్ళు కుట్టేట్లు ఉంటారు. అటువంటిది అతని నోటి వెంబడి ఆ ప్రశ్న రావడం అందరికీ ఆశ్చర్యమనిపించింది.

రాజు మళ్ళీ అదే ప్రశ్న అడిగాడు.

" నేను జోక్ చేయడం లేదు. మీకు తెలిస్తే చెప్పండి. సుఖం ఎక్కడ ఉంది?"

మారుతికి చిర్రెత్తుకొచ్చింది. " ఇంకెక్కడ ? డబ్బులో !"

" ఐసీ !" తలాడించాడు రాజు.

" నో ! సుఖం అందంలో ఉంది" చెప్పాడు మందంగా మదన్.

" ఓహ్ !" రాజు.

" కాదు. సెక్స్‌లో ఉంది." అప్పారావు అరిచాడు.

" ఆహా ! " రాజు కళ్ళు ఎగరేశాడు.

" పవర్‌లో ఉంది బాగా ఆలోచిస్తే !" చెప్పాడు విఠల్.

" వర్తమానంలో ఉంది. ఎందుకంటే గతం చేదు – భవిష్యత్తు అంధకారం ! నడుస్తున్న వర్తమానం మన సొంతం." అవకాశవాది ఆనందరావు ఉవాచ.

" నాకు మటుకు వేడి వేడి పకోడీలు తినడంలో ఉంది." లొట్టలసుకుంటూ చెప్పాడు మధు.

" కాదు, మందులో ఉన్న మజా మగువలో లేదు – మటన్‌లో లేదు." దేవదాసు రాందాసు చెప్పాడు.

" ఏమో ! నాకు మటుకు నిద్రలో ఉన్న సుఖం యింకెక్కడా కనపడలేదు. ఈ ప్రపంచాన్ని, బాధల్ని మరచిపోయి కొన్ని గంటలు చచ్చిన శవంలా నిద్రపోతే ఎంతో ఫ్రెష్‌గా ఉంటుంది." నిద్రపోతు నిరంజన్ వక్కాణించాడు.

" కామాక్షి కన్నులలోని ప్రేమను చూస్తే ఈ జగత్తునంతా మర్చిపోతాను. ఆమె సొగసు, ఆమె మనసు నాకు యిచ్చే తృప్తి ఎక్కడా లభించదు". రోమియో రంగారావు చెప్పాడు.

" థ్యాంక్యూ ! ఇంతమంది యిన్ని రకాలుగా సుఖపడుతున్నారు. ఎవరు అన్నారు మనిషి బ్రతుకు మిథ్య అని ! సంసారం భ్రమ అని ! ఎండమావిలో ఎంత దాహం తీరుతుందో ఈ సంసారంలో సుఖం అంత అని. కాని మిమ్మల్ని చూస్తుంటే... అది

తప్పని తెలుస్తున్నది ! రాజు చెప్పాడు.

రాజు కాలేజీ వదిలి వచ్చాడే గాని సుఖం ఎక్కడున్నది అన్న ఆలోచన అతన్ని వెంటాడసాగింది. ఇంతమంది యిన్ని రకాలుగా సుఖంగా సంతోషంగా ఉంటే తను ఎందుకు సంతోషంగా, సుఖంగా ఉండలేక పోతున్నాడు.

" ఎందుకండీ ఇంత ఆలశ్యం అయింది?" సారిక ప్రశ్న.

" నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చాను" చెప్పాడు.

" అబ్బ ! స్కూటర్ కొనమని ఎన్నిసార్లు చెప్పాను. డబ్బులుంచుకొని కొనరు." విసుక్కుంది.

" అది కాదోయ్ ! ఒకసారి స్కూటర్ కొంటే చిన్నదానికి, చితకదానికి దాన్నే వాడుతాం. చివరికి నడవడం కూడా మర్చిపోతాం. అయినా స్కూటర్‌లో సుఖం ఉందా?" రాజు.

" ఎందుకు లేదు. ఎంచక్కా నడవక్కర లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు క్షణాలమీద వెళ్ళచ్చు. ఈ సిటీ బస్సులకోసం, రిక్షాలకోసం, ఆటోల కోసం టైం వేస్టు చేసుకోనక్కరలేదు. అన్నిటికి మించి ఛార్జీలు బాగా కల్సి వస్తాయి. సరే ! ఎలాగూ నన్ను వెనకాల ఎక్కించుకుని ఊరంతా తిప్పుతారుగా, నేను నడవక్కరలేదు. ఎంత సుఖం!" గారాలు పోయింది సారిక.

" హూ ! దేవుడిచ్చిన కాళ్ళను పక్కనపెట్టి వాహనం ఎక్కడం కూడా సుఖమే నన్నమాట. నాకు తట్టనేలేదు."

" మీదంతా విడ్డూరం ! లోకమంతా ముందుకు పోతూంటే మీరు మటుకు వెనక్కు, వెనక్కు వెళతానంటారు!"

" ఫర్వాలేదు భూమి గుండ్రంగా ఉంది కదా. అలా ముందుకు వెళ్ళినవాళ్ళు నాలా వెనక్కు మళ్ళిన వాళ్ళు ఎక్కడోచోట కలుసుకుంటారు." చిన్నగా నవ్వాడు.

" నిజం ! మాటలు చెప్పి మభ్య పెట్టడంలో మీరు ఆరితేరారు - అయినా స్కూటర్ నాకంటే మీకే ఎక్కువ ఉపయోగం."

" ఉపయోగమో, కాదో? ఆ యోగం ఉంటే కొంటాము."

" కాస్త ఆ ఈజీ ఛైర్లో రిలాక్సు కండి. మీ అలసట పోతుంది." చెప్పింది.

రాజు ఆ ఈజీ ఛైర్లో నడుం వాల్చాడు.

" హమ్మయ్య సుఖంగా ఉంది." అనుకున్నాడు.

అయితే పెద్ద సుఖాలను ఆశించి, ఇట్లాంటి చిన్న సుఖాల గురించి ఆలోచించడం లేదన్నమాట. అని అనుకున్నాడు రాజు.

" ఏమండీ మీరు తొందరగా తయారైతే సినిమాకు పోదామండి." కాఫీ గ్లాసు అందిస్తూ గునిసింది సారిక.

" ఆ ! సినిమాకా ! అక్కడేం సుఖం ! గాలిరాని థియేటర్లో, సీట్లు బాగుండవు. పైగా నల్లుల స్పెషల్ వడ్డింపు. ఆపైన బీడీలు, సిగరెట్ల కంపు, ముందువాడు నిటారుగా కూర్చుంటే బొమ్మ సగం కనపడదు. పోకిరి వెధవల ఈలలు, చప్పట్లు, ఇంత గందరగోళం మధ్య నీకు సినిమా సుఖం యిస్తుందా!" విస్తుపోయాడు.

" ఆ ! ఈ బుల్లిపెట్టె ముందుకంటే, మీరు చెప్పిన ఆ హాల్లో కూర్చుని సినిమా చూస్తే స్వర్గానికి బెత్తెడు దూరంలో ఉంటాం!"

" సారీ సారికా ! ఈ రోజు ఆ సుఖాన్ని వాయిదా వేస్తున్నాను. ఇంకో రోజు పోదాం. ఇప్పటికే ఆట మొదలై ఉంటుంది."

" పోనీ సెకండ్ షోకు పోధాం !"

" వ్వాట్ ! నువ్వు పేపరు చూడ్డం లేదా ! అర్థరాత్రి పూట ఆడది ఒంటరిగా కాదు జంటగా తిరిగినా డేంజరే ! వాళ్ళ మాన, ప్రాణాలకు హామీ లేదు. సెకండ్ షో సినిమా నుంచి వస్తున్న జంటను అల్లరి పెడుతూంటే చూసి వారించబోయిన అమాయకుడు ఆ రౌడీల చేతి కత్తిపోట్లతో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఒంగోలులో... ఇంకోడు..."

" ఆపండి ! శుభమాని మొదలు పెడితే మీరు చావులు, రేవులు మాట్లాడుతున్నారు. ఇంకో రోజు పోదాం. ఈ రోజే పోవాలని నాకంత పట్టుదలేం లేదు. నా అభిమాన నటుడి సినిమా మరి మొదటి రోజే చూసెయ్యాలని అనుకోను నేను." సారిక చెప్పింది.

" గుడ్ ! సారికా జీవితమంటే ఏమిటి?"

" చావు పుట్టుకల మధ్య నడిచే నాటకం !" సారిక ఠపీమని చెప్పింది.

ఆ జవాబుకు ఖంగుతిన్నాడు రాజు.

" నాటకంలో సుఖం లేదా? అంతా దుఃఖమేనా?"

" ప్చ్ ! సుఖం ! అది చూసే వాడి దృష్టి పట్టి ఉంటుంది. పంచ భక్ష్య పరమాన్నాలు తింటూ 'అయ్యో ! తినలేక ఛస్తున్నారా!" అంటూ ఏడిస్తే మనమేం చేయగలం. అయినా అంతా అనుకోవడంలో ఉందండి. నేను సుఖంగా ఉన్నాను అని అనుకోండి. నిజంగానే మీరు సంతోషంగా, సుఖంగా ఉంటారు." సారిక చెప్పింది.

" ఓహ్ ! హిప్నాటిక్ సజెషన్ ! బాగుంది - ఐయామ్ హ్యాపీ !"

" డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చోగానే రాజుకు నోరూరింది. అతనికిష్టమని ఉల్లిపాయ పకోడి, డబుల్ కా మిట్టా చేసింది. వడియాలు, అప్పడాలు, ఊర మిరపకాయలు

వేయించింది. ఎలాగూ క్యాబేజీ కూర, ఉల్లిపాయ పప్పు ఉండనే ఉన్నాయి. నాలుక తడుపు కోవడానికి రసం, గడ్డ పెరుగు సిద్ధం!

సింహం జింకమీద కురికినట్లు... అన్నం ప్లేటు మీదకు కలియబడ్డాడు. తృప్తిగా తిన్నాడు. బేవ్‌మని తేన్చాడు.

" తృప్తి కలిగిందా?" సారిక అడిగింది.

" యస్! సంతృప్తిగా తిన్నాను" చెప్పాడు.

" మరి సుఖంగా ఉందా?"

" ఆ ! క్షణికానందం కలిగింది. తిన్నదంతా అరిగేదాకా హాయిగానే ఉంటుంది."

" చాలు ! సుఖపడుతున్నారన్న మాట ! ఇదే సుఖం ! ఈ జీవితంలో యింతకంటే పెద్ద సుఖాలు ఏముంటాయి? వేళకు యింత తినడం, తొంగోడం అవే పెద్ద సుఖాలు."

" కాని ఇవన్నీ క్షణికాలే కదా ! తింటున్నంత సేపు బాగుంటుంది అన్నం... ఆహారం ! అలాగే నిద్రపోతున్నప్పుడు ఫర్వాలేదు... ఆ తర్వాత అదంతా మర్చిపోతాం కదా !"

" అందుకోసమే ఒక్కసారి... 'అమ్మా ! అన్నం పెట్టండని' మనింటికి వచ్చే అడుక్కుతినేవాడిని గుర్తుకు చేసుకోండి. వర్షం వస్తున్నా తడుస్తూ అడుక్కోవల్సిందే. బద్ధకిస్తే పస్తే... లేదా ఎవరూ కనికరించకపోతే కడుపు కాల్తుంది. మనం ఇంత పెద్ద యిళ్ళల్లో ఉండి, అన్ని తలుపులు వేసుకుని, బయట వర్షం ఉందని రగ్గులు కప్పుకుంటాం వెచ్చగా, కాని ఆ ముష్టివాడు పాపం ఎటువంటి కప్పు లేకుండా, ఎటువంటి రగ్గు లేకుండా, తడిసిన బట్టలతో, చిత్తడి నేల మీద నిద్రపోవాలి... వాడ్ని గుర్తుకు తెచ్చుకుంటే మీరెంతో సుఖపడుతున్నారో ఆలోచించండి" సారిక ఆవేశంగా చెప్పింది.

" మరీ ముష్టి ఉపమానం తెచ్చావుగదటే ! పోయి పోయి నన్ను ముష్టివాడితో పోల్చుకోమంటావేమే ! కనీసం మీ కజిన్ లక్ష్మినారాయణతోను, వాసుదవరావుతోనో పోల్చుకోమనచ్చుగా!" బాధపడ్డాడు రాజు.

" నిజమే ! మన కళ్ళముందు నిత్యం కనిపించే వాడ్ని తీసుకోకుండా, అల వైకుంఠపురంబులో ఉన్న నారాయణని ఎలా తీసుకుంటాం చెప్పండి?"

" సంతోషించాం.. ఇంక పండుకో !"

" ఆల్ రైట్ ! పాపం ! ముష్టివాడికి ఈ సుఖం కూడా ఉండదు కదండి." అతని దగ్గర పడుకుంటూ అంది.

" రామ ! రామ ! ఆపవే ! నీ కవిత్వంతో తిన్నదంతా తిరిగొచ్చేట్లుంది" అంటూ లైటార్పేశాడు.

కాసేపటికి నిద్రపోబోతున్న రాజును అడిగింది సారిక. " ఇంతకీ సుఖం దొరికిందా మీకు."

" ఆ ! క్షణిక సుఖం.. సుఖం అంటే ప్రతి నిమిషం ఆనందంగా ఉండేది కావాలి ! ఇలా తాత్కాలికంది కాదు.

" మిమ్మల్ని మార్చడానికి ఆ బ్రహ్మదేవుడు రావాల్సిందే !" సారిక విసుక్కుని పక్కకి తిరిగి పడుకుంది.

ఆ రోజు లక్ష్మినారాయణ ఇంటికి పోవలసి వచ్చింది. ఇంటికొచ్చి పిల్చిపోయారు. కావాలంటే కారు పంపిస్తానన్నారు. ఇంక మొహమాటానికి పోక తప్పలేదు.

లక్ష్మినారాయణ కొడుకు శ్రీకాంత్ పుట్టినరోజు పండుగట ! చాలా ఘనంగా చేస్తున్నాడు. ఆ రోజు తన స్నేహితుల్ని, బంధువుల్ని ఆహ్వానించాడు.

గొప్పవారి విందు ఘనంగా ఏర్పాటు చేయించాడు. మూడు చోట్ల బఫే అరేంజ్ చేశాడు. తిన్నవాళ్ళకు తిన్నంత. మందు బాబులకు మందు భాగ్యం కల్గించాడు. ముక్కలు వాళ్ళకు ముక్కలు చేయించాడు.

లక్ష్మినారాయణ గొప్ప వ్యాపారవేత్త! అతనికి పెద్దలతో పరిచయం జాస్తి! అందుకని వాళ్ళ లెవలు తగ్గట్టు ఏర్పాట్లు చేశాడు.

రాజు అవన్నీ చూసి దడుచుకున్నాడు. సారిక అంతకు ముందు రెండు, మూడు సార్లు వెళ్ళింది కాబట్టి అంతంగా బెదిరిపోలదు. వచ్చిన అతిథులు, యిస్తున్న కానుకలు చూస్తుంటే కళ్ళు తిరుగుతున్నాయి. తాను ఒక ముష్టి ప్రజెంటేషన్ తీసుకుపోయాడు. ఓ రెండొందలు ఖర్చుపెట్టి !

లక్ష్మినారాయణ దాన్ని చూడకుండా పక్కకు గిరాటు పెట్టాడు. మరి వెండి, బంగారం ముందు స్టీలు ప్లేటు దిగదుడుపే గదా!

అక్కడికి వచ్చిన వాళ్ళ చీరల ఖరీదు గురించి సారిక చెప్పింది అందాజుగా. ఒంటికి రూపాయల నోట్లు చుట్టుకొచ్చినట్లు అనిపించింది రాజుకు.

ఖరీదైన నగలు, చీరలు, సూట్లు, బూట్లు మధ్య దిష్టిబొమ్మలాగా తానెందుకు తగలడ్డాడని బాధపడ్డాడు.

భోజనాల దగ్గర చాలా మొహమాట పడ్డాడు. ఎక్కడ తన్ను కక్కుర్తి అనుకుంటారో అని కడుపు కాల్చుకుని తక్కువ తిన్నాడు. అఫ్‌కోర్సు ! ఎవరూ యితన్ని బలవంతం పెట్టలేదు తినమని.

చాలామంది సగం తిని పారేశారు.

డ్రింక్సు కోసం ఎగబడుతున్నారు

సారిక అనుమానంగా యితని వంక చూసింది.

తల అడ్డంగా ఊపాడు.

వెళదామని తొందరించాడు సారికను. కాని ఆమె మటుకు రాలేదు. తన బంధువుల మధ్య ఉండిపోయింది. పార్టీకి వచ్చినవాళ్ళు ఒకళ్ళొక్కళ్ళే జారుకున్నారు.

రాత్రి పదకొండు దాటింది. ఇంక వెళదాం అని బయలు దేరింది సారిక.

" ఒక్కనిమిషం ! " లక్ష్మినారాయణ చెప్పాడు.

లోపలినుంచి అతని భార్య రజని బట్టలు తెచ్చింది. చూస్తుంటేనే తెలుస్తుంది. ఒక పట్టుచీర, మంచి ఖరీదైన ప్యాంటు, షర్ట్ క్లాత్ అని !

" ఇవన్నీ ఇప్పుడెందుకు?" సారిక అడిగింది తిరస్కరిస్తూ.

" భలేదానివే ! అయిన వాళ్ళకు యిప్పుడు పెట్టకపోతే ఎప్పుడు పెడతాం తీసుకో". బొట్టుపెట్టి యిచ్చింది రజని.

" అయ్యో ! నాకెందుకండి ?" శుష్కమందహాసం చేశాడు రాజు.

" తప్పవు గదండి. వెధవ పార్మాలిటీసు ఉన్నాయిగా తీసుకోండి. మీ ఒక్కరికిస్తే మాకేం బరువు అవుతుంది." లక్ష్మినారాయణ చెప్పాడు.

" థ్యాంక్స్ ! ఫంక్షన్ చాలా గ్రాండ్ సక్సెస్ అయింది." రాజు.

" ప్చ్ ! తుస్‌మంది. నేను అనుకున్న డీల్ సెటిల్ కాలేదు. అది అయి ఉంటే ఓ పది లక్షలు లాభం వచ్చేది." లక్ష్మినారాయణ బాధపడ్డాడు.

అందుకేనా అతను ఔటాఫ్ మూడ్‌లో ఉంది అనుకున్నాడు రాజు. " మీకేం లెండి - ఇది కాకపోతే యింకోటి వస్తుంది. సుఖంగా ఉన్నారు చాలు." రాజు ఓదార్పుగా అన్నాడు.

" సుఖమా ! మాకా ! భలేవాళ్ళే ! ఛ ! ఛ ! కంటిమీద కునుకుండదు, ఎప్పుడూ ఒకటే ఆలోచనలు. ఏ డీల్ ఎవడు కొట్టుకుపోతాడో, దాంతో ఎంత నష్టం వస్తుందో అని " లక్ష్మినారాయణ చెప్పాడు.

" నిజం ! మా ఆయన చెప్పింది. కొన్ని రోజులైతే స్లీపింగ్ ట్యాబ్లెట్సు వేసుకుని నిద్రపోతారు. ఇక నా సంగతి చూద్దామా - అన్నీ రోగాలే ! స్వీట్సు తినకూడదు, శనగపిండి తినకూడదు, గడ్డ కూరలు అరగవు, నానా బాధలు పడుతున్నా !" రజని చెప్పింది.

" అయినా యివన్నీ ఒక కష్టం కింద లెక్కా ! డబ్బుంటే అన్నీ గాలికి కొట్టుకుపోతాయి." సారిక చెప్పింది.

" డబ్బుండగానే సుఖపడాలని లేదు. ఒకప్పుడు నేను అనుకునేవాడిని, డబ్బులోనే సుఖం ఉందని - కొంత ఉండచ్చు, కాదనను, కాని అంతా డబ్బే యిస్తుంది అనుకుంటే

భ్రమ! డబ్బుతో కొనలేనివి, డబ్బుకు లొంగనివి చాలా ఉన్నాయి ఈ లోకంలో" చెప్పాడు లక్ష్మీనారాయణ.

" అసలు సారికకేం ! ఇద్దరూ చూడముచ్చటగా ఉన్నారు. చిన్న కుటుంబం - చింతలు లేని కుటుంబం!" రజని అంది.

" పీత కష్టాలు పీతవి. చెప్పుకోకూడదు కాని ఆర్థిక యిబ్బందులు చాలా ఉన్నాయి." సారిక చెప్పింది సిగ్గుపడుతూ.

" ఎవరికుండవు. ఎవరి ఆదాయం ఎవరికి సరిపోతున్నది? అందరిదీ లోటు బడ్జెట్!" రజని చెప్పింది.

" అది మన విషయమే కాదు. దేశాల విషయంలో కూడా అంతే ఆదాయానికి మించి ఖర్చులుంటాయి" లక్ష్మీనారాయణ చెప్పాడు. " ఇంతెందుకు... నాకు ఎవరు అప్పు యిస్తారాని చూస్తున్నాను. కాకపోతే మీ అప్పు వందల్లో ఉంటే నాది లక్షల్లో ఉండచ్చు".

" ఎంత తేలిగ్గా చెప్పారు. డబ్బు ముందు మనిషి కోతి అయిపోతున్నాడు. డబ్బు ఆడించినట్టల్లా ఆడుతున్నాడు" రాజు.

" అంతే ! పోను పోను వచ్చేది రక్తసంబంధాలు కాదు, ఆర్థిక సంబంధాలు మాత్రమే ! బి హ్యాపీ !" రజని చెప్పింది.

" గుడ్‌నైట్ !" చెప్పి బయట పడ్డారు ఇద్దరూ !

కాలనేమి చక్రంలో రాజు తండ్రి అయ్యాడు.

బాబు - బుజ్జి చిన్న పిల్లలు. అడపా, తడపా రోగాలు, రొష్టులు ఊపిరి ఆడేది కాదు. ఒక రోజు పిల్లలకు బాగోలేక పోతే యింకో రోజు సారికకు సుస్తీ చేసేది. అందరూ బాగుంటే తనకు బాగుండేది కాదు. అన్నీ అందరూ బాగుంటే ఆఫీసులో వర్క్ ఎక్కువ కావడమో, ఏవో సమస్యలు ఉత్పన్నం కావడమో జరిగేది.

ఇలా వేగంగా పరుగెడుతున్న కాలంలో రాజుకు తను సుఖపడుతున్నది, లేనిది గమనించుకునేటంత సమయం కూడా ఉండేది కాదు.

ఆఫీసులో ఉండగా ఫోన్ వచ్చింది. దామోదరంకు సీరియస్‌గా ఉందని కంగారుపడి పర్మిషన్ తీసుకుని హాస్పిటల్‌కు వచ్చాడు.

బస్సు యాక్సిడెంటంట ! శ్రీశైలం పోదామని బయలుదేరిన బస్సు లారీకి ఢీ కొట్టింది. ముందు సీట్లో కూర్చున్న దామోదరంకు బలమైన దెబ్బ తగిలింది మెదడు పైన ! శరీరంపైన - కనపడటం లేదు.

దామోదరం భార్య శాంత రాజుకు దగ్గర బంధువు. గొల్లుమని ఏడ్చింది అతన్ని పట్టుకుని.

" ఏమైంది శాంతా!"

" అన్నయ్యా ! బావగార్కి సీరియస్‌గా ఉంది" ఏడ్చింది.

రాజు పోయి డాక్టరుతో మాట్లాడి వచ్చాడు. ఆ మాటల్లో తేలిందేమిటంటే దామోదరం కండిషన్ క్రిటికల్‌గా ఉంది. ఆశలు తక్కువ. వాళ్ళ శాయశక్తులా వాళ్ళు ప్రయత్నిస్తున్నారు. కాదు కూడదు అంటే హైద్రాబాద్‌కు తీసుకుపోవడానికి తమకేం అభ్యంతరం లేదని చెప్పారు.

" రెండు రోజుల నుంచి పదివేలు ఖర్చయిపోయాయి. ఈయన ఇంకా కోలుకోలేదు." బాధపడ్తు చెప్పింది శాంత.

" హైద్రాబాద్ తీసుకుపోతారా?" అడిగాడు రాజు.

" అక్కడ మాకెవరున్నారు?"

రాజు తడబడ్డాడు. అదీ నిజమే ! అసలు ముక్కు మొహం తెలియని ఊరు. అడుగు తీసి అడుగు పెట్టాలంటే ఆటో కావాలి. మీటరు వేయని ఆటోల్లో పైసలు పరుగెత్తుతాయి రేసు గుర్రాల్లా. మానవత్వం లేని మనుషుల మధ్య డబ్బులు చాలా నష్టపోవాల్సి వస్తుంది.

" ఆలోచించు... చేర్పించడానికి తోడుగా రమ్మంటే నేను వస్తాను, కాని నాకు ఆఫీసులో సెలవు దొరకదు. చేర్పించి వెంటనే వచ్చేస్తాను. కాని డబ్బుల గురించి ఆలోచించుకో... ఇప్పుడంతా ఐదు నక్షత్రాల వైద్యం అయిపోయింది. దేనికైనా వేలల్లోనే! కనీసం యాభై ఖర్చు కావచ్చేమో !" రాజు చెప్పాడు.

శాంత మొహం దించేసుకుంది.

" అన్నయ్యా ! అంత డబ్బులు నా దగ్గర ఎక్కడున్నాయి. ఆయన సంపాదిస్తూంటేనే ఇల్లు గడవడం కష్టంగా ఉంది. ఇప్పటికే  నాజత గాజులు అమ్మేశాను. చైను కూడా అమ్ముతాను కాని... బాగు కాకపోతే..."

బాగా ఆలోచించిన మీదట పరాయి డాక్టర్లను నమ్ముకోవడం కంటే తనూరి డాక్టర్లను నమ్ముకోవడమే శ్రేయస్కరం అనిపించింది.

రాజు కొన్ని గంటలుండి... తనకు తెల్సిన వాళ్ళతో డాక్టర్లకు చెప్పింది... భారమైన గుండెతో ఇంటి ముఖం పట్టాడు.

దామోదరం - శాంతలది అన్యోన్యమైన దాంపత్యం అని అప్పట్లో చాలామంది అనుకునేవారు. శాంత పెద్దల్ని ఎదిరించి, పక్కింటి దామోదరంను పెండ్లి చేసుకుంది.

దామోదరం చిరుద్యోగి... అయినా శాంత ఎప్పుడూ విచారపడ్డ దాఖలాలు రాజు చెవికి చేరలేదు. ప్రశాంతంగా సాగుతున్న జీవిత నౌకలో తుఫానులాగా ఈ యాక్సిడెంటు

బాగా సుఖపడుతున్న సంసారం.. నీరసంగా మారిపోయింది.

సారికకు దామోదరం పరిస్థితి వివరించాడు.

" ఆమె అతన్ని హైద్రాబాద్‌కు తీసుకు పోవలసింది." సారిక చెప్పింది బాధపడ్తూ.

" నువ్వయితే తీసుకుపోయేదానివా!" చిలిపిగా అడిగాడు.

సారిక అతని నోరు మూసింది.

" పొరపాట్న కూడా అటువంటి కష్టం ఎవ్వరికీ కలుగ కూడదు. ఏ జన్మలో ఏ పాపం చేసుకుంటేనో ఇలా జరుగుతుంది."

" పాపం ! శాంతను చూస్తే జాలేస్తుంది. అది ఏం సుఖపడి ఉంటుంది కనుక. అతని జీతం ఇంటికి సరిగా కూడా సరిపోయేది కాదు."

" సరే ! మీరేమన్నా సాయం చేశారా లేదా?"

" ఆ ! అందరికీ చెప్పి వచ్చాను."

" అది కాదండి... ఆర్థికంగా..."

" ఆమె ... అడగలేదే !"

" అడుగుతారటండీ ! మనం కనుక్కుని చెయ్యాలి కాని."

" కాని, ఎంతని చేస్తాం. మనమూ పెద్ద లక్షాధికారులమేం కాదు. పైగా అడక్కుండా కావాలా అంటే ఎంత అడుగుతారో మనకేం తెల్సు !"

" అదీ నిజమే. అందుకే ఓ అయిదో, పదో చేతిలో పెడితే సరిపోతుంది." చెప్పింది సారిక.

" అలాగే... రేపు చూద్దాం.." చెప్పాడు.

మళ్ళీ అతని బుర్ర తిరిగిపోసాగింది. సుఖం ఎక్కడుందని... అందరూ అనుకుంటున్న సుఖం నిజంగా సుఖమేనా ? దుఃఖం దాగిన సుఖమా!

శాంత తన సంసారం కోసం తాపత్రయ పడింది. కొన్నాళ్ళు సుఖ పడ్డానని భ్రమించింది. ఇప్పుడు అతని కేమన్నా అయితే ఓ జీవిత చక్రానికి అలవాటు పడ్డ ప్రాణం... కష్టపడదూ!

అసలు చాలా మంది పెళ్ళిలో సుఖం ఉందని ఎందుకు అనుకుంటారో అర్థం కాదు. క్షణిక సుఖం కోసం శాశ్వత దుఃఖాన్ని ఆహ్వానించడమని గ్రహించరు.

మరునాడు డబ్బు తీసుకుపోయే సరికే అంతా అయిపోయింది.

శాంత బాడీని తీసుకుని యింటికి వెళ్ళిపోయింది.

రాజు - సారిక ఆటోలో శాంత యింటికి వెళ్ళారు. దుఃఖ సముద్రంలో శాంత

కొట్టుకుపోయింది.

ఇరుగు పొరుగు, బంధువులు, అందరూ వచ్చారు కాని ఆమె బాధను ఎవరు భాగించుకోగలరు!

చిన్న పిల్లలు బిక్క మొహాలేసుకుని చూస్తున్నారు.

పాతికేళ్ళకే శాంత నుదిటి బొట్టు చెదిరిపోయింది.

అతనితో పాటే తనను దహనం చేయమని గోల పెట్టింది శాంత. ఆమెను పట్టుకోవడం ఆమె తల్లిదండ్రులకే చేతకాలేదు. ఇక దామోదరం తల్లిదండ్రుల బాధకు అంతులేదు. ఇదంతా శాంత తలరాత వలనే జరిగిందని వాళ్ళ ప్రగాఢ విశ్వాసం !

వాళ్ళ ఏడ్పులో ఆ మాటలు కూడా వినిపించాయి.

నిక్షేపం లాంటి వాణ్ని పొట్టన పెట్టుకుందని ఆడిపోసుకున్నారు.

జీవి పుడుతూ ఏడుస్తాడు ఈ లోకంలోకి ఎందుకొచ్చానని

జీవి పోతూ ఏడుస్తాడు తన వాళ్ళను వదిలి పోతున్నానని

ఈ రెండు ఏడ్పుల మధ్య కనీసం జీవితం నవ్వులతో గడిపితే బాగానే ఉంటుంది.

పెద్దయిందగ్గర్నుండి సీటు కోసం ఏడ్పు - ఫీజులు కట్టడం కోసం ఏడ్పు - చదువు సరిగా రాలేదని, చదుకోవడం లేదని ఏడ్పు - కోరిన కోర్సులో సీటు రాలేదని ఏడ్పు - అన్నీ సరిగ్గా జరిగినా అనుకున్న ఉద్యోగం రేలదని ఏడ్పు- ఉద్యోగమొచ్చినా అనుకూలమైన పోస్టింగు రాలేదని ఏడ్పు - అన్నీ సక్రమంగా జరిగినా సరియైన పెళ్ళికోసం ఏడ్పు - పెళ్ళయిన దగ్గర్నుండి ఇంకా పెద్ద ఏడ్పు - కోరస్‌గా అటువాళ్ళు, యిటువాళ్ళు.

నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశం అందుకోవాలని పోటీ పడుతున్నాయి. ప్రజల సంపాదన పాతాళంకు పోవాలని ఆరాటపడుతున్నది. రూపాయి విలువ పడిపోతున్నది. ముఖ్యంగా చిరుద్యోగుల జీతాలు - పేపరు మీద పెరిగినా - పడిపోయిన రూపాయితో పోలిస్తే - నిజానికి తగ్గిపోతున్నాయి.

ఆధునిక జీవితంలోని విషాదం - విద్యారంగం - వైద్యరంగం వ్యాపారంగా మారిపోవడం - కాదేది కవిత కనర్హం అన్నట్లు " ఏది కాదు వ్యాపారానికి వస్తువు?"

బాబును యల్.కే.జీలో చేర్పించడానికే చెమటలు పట్టేస్తాయి. సీటు కోసం తిరగడం - మళ్ళీ రికమెండేషను - పైగా వేలల్లో డొనేషను - వాడి డ్రస్సులు - పుస్తకాలు వగైరాలు చూసే సరికి సినిమా రీలులాగా తన చదువు మొత్తం గుర్తుకొచ్చింది.

తన డిగ్రీకైన ఖర్చు బాబు కాన్వెంటు ఖర్చుకే సరిపోయేట్టు లేదు.

జీతం చాలక కొంచెం కొంచెంగా యిబ్బంది పడుతున్నాడు. అంతకు మునుపు పండుగలకు, పబ్బాలకు బట్టలు కొనేవాడు. ఇప్పుడు సంవత్సరానికి ఒక ముఖ్య పండుగకు

కొంటున్నాడు. సారికకు నచ్చ చెబుతున్నాడు. ఇంటి నిండా బట్టలు పెరిగిపోతున్నాయి. చూస్తూ చూస్తూ పారెయ్యలేమని సర్ది చెబుతున్నాడు.

ఒక రోజు హోటల్ మౌర్యకు రమ్మని కబురొచ్చింది. ఆశ్చర్యంగా వెళ్ళేసరికి కిషోర్ రూములో ఉన్నాడు.

కిషోర్ ఇంటర్‌లో క్లాసుమేటు. డిగ్రీలో వేరయ్యారు. అతనికి ఇంజనీరింగులో సీటు వచ్చింది. తనకు రాలేదు. అలా రాజు కలలు కల్లలయ్యాయి. తరువాత అతను స్టేట్సు వెళ్ళిపోయాడని విన్నాడు. మళ్ళీ యిప్పుడే కలవడం.

" హాయ్ కిషోర్ ! వాటె సర్‌ప్రైజ్ విజిట్!" ఆనందంగా కౌగలించుకుంటూ అడిగాడు.

" రాజూ ! నన్నింకా మర్చిపోలేదా?" గద్గద స్వరంతో అడిగాడు.

" హూ ! నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేను. ఇంటర్‌లో మనం ఎంత క్లోజో నాకింకా గుర్తుంది."

" సారీ ! నువ్వు నా పెళ్ళికి రాకపోతే మర్చిపోయావనుకున్నాను." చెప్పాడు కిషోర్.

" సారీ ! నన్ను పిలవలేదని రాలేదు." రాజు అన్నాడు.

" అదేంటి కార్డు పంపించానే ! చేరలేదా!"

" బహుశ మిస్ అయి ఉంటుంది." ఆ ప్రస్తావన పొడిగించటం యిష్టం లేక చెప్పాడు రాజు.

" కమాన్ ! లెటజ్ డైన్..." కిషోర్ అతన్ని డైనింగ్ హాల్‌కు తీసుకుపోయాడు. రకరకాల ఐటమ్సు ఆర్డరిచ్చాడు. వాటిల్లో కొన్ని పేర్లు రాజుకు తెలియవు కూడ.

మిత్రులు భోంచేస్తూ చిన్ననాటి కబుర్లలో పడిపోయారు. ఆ బాల్యం మధురం ! ఆ తీపి గుర్తులు మధురాతి మధురం !

" ఒరేయ్ ! నన్ను అమెరికా తీసుకుపోరా !" రాజు అడిగాడు.

" ప్చ్ ! అక్కడేముందిరా !" కిషోర్ ప్రశ్న.

" అందిన ద్రాక్ష పులుపా !"

" కాదు ... మనం ఊహించినంత గొప్పగా ఏం ఉండదు ఆ జీవితం – యాంత్రికం !"

" ఆ ! ఇక్కడకూడ అంతేగా !"

" అక్కడ చూస్తే ఈ మాట అనవు. అక్కడి యాంత్రిక జీవితం ఇక్కడకు రావాలంటే కనీసం ఓ యాభై సంవత్సరాలు పడుతుంది. ఇలా నీలాగా ఇంత తీరిక దొరకదు ఎవరికీ.

మనస్సు విప్పి కబుర్లు చెప్పుకోవడానికి, ఆత్మీయులతో మాట్లాడాలన్నా వీక్ ఎండ్‌దాకా వెయిట్ చెయ్యాల్సిందే ! నీకో సంగతి తెల్సా. కనీసం చావుకైనా సెలవులొచ్చేదాకా ఆగాల్సిందే.... అప్పటిదాకా అందరూ కల్సుకోవడం జరగదు."

" అఫ్‌కోర్సు.. అందరూ రెండు చేతులతో సంపాదిస్తున్నారు కాబట్టి క్షణం తీరిక ఉండదు మరి."

" సంపాదనా ! నీకో సంగతి తెల్సా ! అక్కడా పెద్ద జీతాలేం లేవు... కాకపోతే డాలరు మారకపు విలువ వలన అక్కడ జీతాలు ఎక్కువని అపోహపడతాం ! ఇక్కడ రూపాయి - అక్కడ డాలరు ! అంతే ! ఓ కప్పు కాఫీకి ఓడాలరు పెట్టాల్సిందే కదా ! అమెరికాలో అమెరికా పౌరుడిలాగా జీవిస్తే మనం ఏం మిగుల్చుకోలేము. కడుపు కొట్టుకుని మిగిల్చిన డబ్బును, అదే డాలర్లను ఇండియాకు పంపిస్తే అవి రూపాయల కింద మారి - ఇక్కడి వాళ్ళకు ఎక్కడ లేని గర్వాన్ని తెప్పిస్తున్నాయి." కిషోర్ అలా అక్కడి విశేషాలు వివరిస్తూ పోయాడు.

" ఎంత డబ్బిస్తే మటుకు అక్కడ మీలాగా ఆప్యాయత ఎవరు పంచిపెడతారురా?" కిషోర్ బాధగా అన్నాడు.

" నీకేం ! అదృష్టవంతుడివి ! లక్షలు సంపాదిస్తున్నావు! మేం ఏడుస్తామని ఇలా కల్లబొల్లి కబుర్లు చెబుతున్నావు !" నిష్టూరంగా అన్నాడు రాజు.

" ఆ ! నేనెంత అదృష్టవంతుడినో నాకే తెల్సు. ఇప్పుడు అక్కడ ఉద్యోగం మానేసి ఇండియాకు వద్దామన్నా రాలేనంత అదృష్టవంతుడ్ని ! అసలు రావద్దని సలహా యిచ్చేవాళ్ళే ఎక్కువ మందున్నారు. ఎన్ని రాత్రులు, ఎన్ని రోజులు వంటరిగా పిచ్చెక్కినట్లు ఏడుస్తూ గడిపానో మీకు తెలియదు. ఈ ముష్టి డబ్బులు లేక కదా నేను ఇన్ని వేల కిలోమీటర్లు దాటి ఈ దేశం కాని దేశంలో ఇలా అఘోరిస్తున్నానని బాధపడని రోజు లేదు. అక్కడ అన్ని అవమానాలు భరిస్తూ మీ ఎదుట చిరునవ్వులు చిందిస్తూ ఉన్నది కేవలం ఈ డాలర్ల కోసమే ! డాలర్ కోసం డాల్‌లాగా తిరుగుతున్నాను."

" అయినా ఇండియాలో ఏముందనిరా అంత యిదైపోతున్నావు?!" రాజు ఆశ్చర్యంగా అడిగాడు.

" అది నీకు అర్థం కాదురా ! కనీసం నువ్వు ఏ పంజాబుకో, ఏ అస్సామ్‌కో ట్రాన్స్‌ఫ‌ర్ ైతే తెలుస్తుంది. పుట్టినప్పటి నుండి నీ వాళ్ళ మధ్య, నీ ఊళ్ళో తిరుగుతూంటే నేనేం పోగొట్టుకున్నానో నీకు తెలీదు." కిషోర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

" సో ! నువ్వు కూడా సుఖపడటం లేదంటావ్ !" రాజు అడిగాడు అతన్ని ఓదారుస్తూ.

" నేను గనుక సుఖపడుతున్నాను అని అనుకొంటే ఆత్మ వంచన కిందే వస్తుంది. ఈ గాలి, ఈ నేల, కమ్మని ఈ సాంప్రదాయాలు, తియ్యని ఆత్మీయతలను వదిలి, వేలకొద్దీ కిలోమీటర్ల దూరంలో కడుపులో అల్సర్లను పెంచుకుంటున్నానంటే అదే సుఖమంటావా!"

" వైవాహిక జీవితం బాగుందా !"

" ఆ ! బాగుండక ఛస్తుందా ! ఒకరికొకళ్ళం తోడుగా ఉన్నాం కాబట్టి బానే ఉంది" అదోరకమైన తియ్యటి బాధ మొహాన్ని అదోలా పెట్టి చెప్పాడు.

వీడ్కోలు తీసుకునే సరికి రాత్రి పన్నెండైంది.

వస్తూ వస్తూ అనుకున్నాడు రాజు. " అమెరికా బతుకు నాకొద్దు ! ఈ బురద జీవితం నాకు చాలు !"

కాని సారిక మటుకు అలా అనుకోలేదు... అమెరికాలో సెటిలైతే ఎంత బాగుండును అని అనుకుంది.

ఎందుకంటే యిప్పుడిప్పుడే సంసారం బాగా పాతపడిపోయింది. ఒకళ్ళ అభిప్రాయాల్ని మరొకళ్ళు ఖండించడం నేర్చుకొంటున్నారు.

ఒక రోజు...

అరుంధతి వచ్చింది సుడిగాలిలాగా !

అరుంధతి సారిక చుట్టం.. చుట్టపు చూపు కంటే స్నేహం ఎక్కువ. ఓ అర్ధరాత్రి వచ్చి నిద్రలేపింది... ఆకలేస్తున్నదంటూ వంట చేయించుకుని తింది.

మరునాడు నిద్రలేచినప్పటి నుండి హోరెత్తించింది.

" అబ్బబ్బ ! ఆ సంసారం చేయలేకుండా ఉన్నాను. నేను వెంటనే విడాకులిచ్చేస్తాను".

" అదేంటే పిల్లలు ఏమైపోతారు?"

" పిల్లలగురించి ఆలోచిస్తే నేనేమై పోవాలి!"

" అయినా ఇప్పుడు నీ కొచ్చిన కష్టమేంటి!"

" అతనా ఓ కంట్రీ బ్రూట్ ! ఓ రెస్పెక్ట్ లేదు. ఓ మాట, మంచితనం లేదు. అంతా రాయలసీమ కరుకు – మొరటు మనిషి ! ప్రేమంటే తెలీనే తెలీదు." చెప్పింది అరుంధతి.

" పిల్లలు పుట్టిన తరువాత కూడా ఇంకా ప్రేమ కబుర్లు చెబుతాడా మొగాడు, మొగుడు!?" సారిక అడిగింది.

" ఏం ! నాకేం తక్కువ ! నా అందం ఒక్క అంగుళం కూడా వాడలేదు. పైగా కాస్త ఒళ్ళు చేసి యింకొంచెం ఆకర్షణీయంగా తయారయ్యాను."

" సరే ! అందం - పెళ్ళికాని ముందు మొగాడ్ని ఆకర్షిస్తుంది. పెళ్ళయినాక కూడా అదే అందం అతన్ని కట్టిపడేస్తుందను కుంటున్నావా?"

" ఆ ! ఎందుకు కాదు... ఎర్రగా, బుర్రగా ఉన్నా పరాయి ఆడవాళ్ళ చుట్టూ తిరగడూ ఈమగాడు ఏ వయసులోనైనా కూడా !" అరుంధతి అడిగింది.

ఆమె తన గురించి అనడం లేదు కదాని రాజుకు కొంచెం అనుమానం కలిగింది. తేలు కుట్టిన దొంగలా గమ్మున కూర్చున్నాడు. వాళ్ళ కబుర్లు వింటూ.

" అయినా విడాకులిస్తే పిల్లలు ఏమవుతారే ! పెద్దయింతరువాత వాళ్ళ పెళ్ళిళ్ళు ఎలా జరుగుతాయి?"

" అందుకే గదా ఇంకా కోర్టుదాకా పోంది." అరుంధతి.

" అయినా విడాకులు ప్రతి సమస్యకు పరిష్కారం కాదనుకుంటాను... ఆ విడాకులతోనే సమస్యల పుట్టకు శ్రీకారం చుట్టినట్టవుతుంది." రాజు చెప్పాడు.

" ఇప్పటికంటే ఏం సమస్యలు వస్తాయి?"

" మీరు ఇప్పుడు సంఘం పరిరక్షణలో ఉన్నారు. మీ వివాహ బంధం తెగిపోతే... సంఘం రక్షణ కూడా కొంత తెగిపోతుంది. అయినా విడాకులు తీసుకున్న స్త్రీని గౌరవించే అంత స్థాయికి మన సంఘం యింకా ఎదగలేదు." రాజు అన్నాడు.

" అంటే మగాడు ఏం చేసినా భరిస్తూ కూర్చోవాలా! వాడు కుక్కలా ఇంకో దాని వెంటబడ్డా చూస్తూ ఊరుకోవాలా ! " అరుంధతి ఆవేశపడింది.

" అంత సహనం అక్కరలేదు... అతన్ని మంచి మార్గాన నడిపించడానికి చాలా మార్గాలున్నాయి."

" నాకేం కనిపించలేదు."

" అది చూసే వాళ్ళమీద ఆధారపడి ఉంటుంది."

" అంటే నా దృష్టి లోపమా !"

" కాదు... కమ్యూనికేషన్ గ్యాప్ ! ఒకే గదిలో బతకచ్చు... కాని ఒకళ్ళ మనసు ఒకళ్ళు అర్థం చేసుకోవడం చాలా కష్టం అ అంతర్జాతీయ యుద్ధాలకు కాని, ఇంటి పోట్లాటలకు కాని మూలం కేవలం ఈ అపార్థాలే ! తనకు భాష ఉంది అని మానవుడు మురిసిపోతాడు. కాని భాషరాని జంతువులే భేషుగ్గా బ్రతుకుతున్నాయి. వాటి మధ్య ఎప్పుడు కమ్యూనికేషన్ గ్యాప్ ఉండదు. మనిషికి నాకరికత ముదిరి, ఒకరి భావాలు ఒకరు చెప్పినా అర్థం చేసుకోలేని స్థితికి దిగజారిపోయారు." రాజు చెప్పాడు.

" అస్సలు ఆయన తన మనసులో మాట స్పష్టంగా చెబితే కదా తెల్సుకోవడానికి - అయితే నాదే తప్పంటావా!"

" ఇక్కడ తప్పు ఒప్పులు కాదు కావాల్సింది. సంసారమన్న తరువాత సర్దుకుపోవడం నేర్చుకోవాలి" సారిక అంది.

" ఈ రకంగా విడాకులిచ్చుకుంటూ పోతే మనం ఎక్కడ తేలతాం! ఫారిన్‌లో చాలామందికి చాలా పెళ్ళిళ్ళు అవుతాయి. కాని వాళ్ళందరూ సుఖంగా ఉన్నారా? జీవితం అన్న తరువాత ఏదో ఒక చోట రాజీపడి సర్దుకుపోవడం నేర్చుకోవాలి." రాజు చెప్పాడు.

" అయ్యా ! ఆ సర్దుకుపోవడం ఒక వైపు నుంచే వస్తే ఏం చెయ్యాలి! ఇన్నాళ్ళు ఈ సంసారం నిల్చిందంటే, నా ఆత్మాభిమానాన్ని పణంగా పెట్టి అడుగులకు మడుగులొత్తాను. కాని ప్రతి మనిషి సహనానికి ఒక హద్దు ఉంటుందిగా ! అసలు నోరు విప్పడు మానవుడు."

" అరుంధతి గారు ! నాదో చిన్న సలహా - కమ్యూనికేషన్ ఎన్నో రకాలుగా జరుగుతుంది. అందులో మాట ఒక భాగం మాత్రమే ! మీరు గనుక బాడీ లాంగ్వేజ్ అభ్యసిస్తే - చాలా మటుకు మీసమస్య పోవచ్చు."

" బాడీ లాంగ్వేజ్ ! ఇదేం లాంగ్వేజ్‌రా బాబూ!" అరుంధతి.

" మన ఇష్టాన్ని అయిష్టాన్ని చూపడానికి తల అదొకరకంగా, ఇదొకరకంగా ఊపుతాం కదా. దాన్ని బట్టి అవును, కాదు అర్థం చేసుకుంటాం. అలాగే అతని ప్రతి చర్యకు ఒక అర్థం ఉంటుంది. ఆ పుస్తకం నా దగ్గరుంది. చదివి జీవితాన్ని దిద్దుకోండి."

" థ్యాంక్యూ !"

" అది కాదే అరుంధతీ ! నువ్వొకసారి మీ ఆయన్ని సైక్రియాట్రిస్టు దగ్గర చూపించు" సారిక చెప్పింది.

" అతనికి తిక్కేం లేదు. అయినా అతడు రావద్దూ !"

" సంసారాలు కూలిపోకుండా ఉండటానికి సలహాలిచ్చే సామాజిక వేత్తలుంటారు. వాళ్ళతో ప్రయత్నిస్తే సరి!"

" సరే, నారాత ఎలా ఉందో," అరుంధతి కొంచెం ఆవేశం తగ్గించుకుని వెళ్ళిపోయింది.

" ఆరోజు - గేటు దగ్గర చాలాసేపు కాపు కాయాల్సి వచ్చింది. రాజుకు చాలా విసుగొచ్చింది.

" అయ్యగారు ముఖ్యమైన పనిమీద ఉన్నారు. ఎవరినీ రానివ్వద్దన్నారు." అని గేటు దగ్గరున్న ఆ జవాను అడ్డుకోవడంతో హతాశుడయ్యాడు.

చివరికి రాజు ఓ కాగితం ముక్క తీసుకుని ఓ మాట రాశాడు. అది లోపల యిచ్చి రమ్మన్నాడు.

జవాను దాన్ని చదివాడు. అక్బర్ గాడికి - బీర్బల్ గాడు అని ఉంది.

“ ఏం ఏమన్నా మెంటల్ లేచిందా?” అరిచాడు.

“ నీకెందుకు అది యిచ్చిరా - తర్వాత చూద్దాం.”

“ నాకు పనిష్మెంట్ యిస్తారు.” భయపడ్డాడు.

“ ఇస్తేనే పుచ్చుకుంటూ..” ధైర్యం చెప్పాడు.

జవాను భయపడ్తూపోయి ఆ కాగితం ఓ కవరులో పెట్టి లోపల యిచ్చి వచ్చాడు.

ఓ ఐదు నిమిషాల కల్లా కబురొచ్చింది.

అందరూ ఆశ్చర్యపోయారు. అంత పెద్ద బడా నాయకులు, వ్యాపారవేత్తలు, వగైరాలు ఉన్నా ఒక సామాన్యుడికి పిలుపు రావడం... లోపలినుండి.

గుండెలు బిక్కుబిక్కుమంటూ ఉంటే లోపలికి వెళ్ళాడు రాజు.

“ రారా గాడిదా !” భీకరంగా కేకవేశాడు అగ్రసింహాసనం మీద కూర్చున్న మినిష్టరు అక్బరు.

“ సారీ ! తమరు... మినిష్టరు.. ఇంకేం చెయ్యాలో దిక్కుతోచక అలా రాశా. రాజు అంటే గుర్తుపడతారో లేదోనని.”

“ చాల్లే నోర్ముయ్!” అని అందరి వంకా చూశాడు బయటకు పొమ్మని. “ఓ పది నిమిషాలు - నా ఫ్రెండ్‌తో మాట్లాడాలి.”

మౌనంగా అందరు వెళ్ళిపోయారు తలుపు దగ్గర వేసి.

“ ఏంటి ఇన్నాళ్టికి గాను వీడు గుర్తుకు రాలేదా.!” అక్బర్.

“ సారీ ! మంత్రివై పోయారు... నేను గుర్తుంటానో ఉండనో అని భయపడి రాలేదు.”

“ మరి ఇప్పుడెందుకు వచ్చావు రా వెధవ !”

“ మా ఆవిడ తరిమింది. లేకపోతే వచ్చేవాడ్ని కాదు.”

“ చెల్లెమ్మ కరెక్టు ! ఈ మినిష్టరీలు శాశ్వతమా... ఒరే మన బాల్య స్నేహం ఎలా మర్చిపోతాంరా ! ఆఖరికి నేను పి.యమ్. నైనా నేను నీకు అక్బర్ గాడినే, నువ్వు నాకు బీర్బల్ గాడివే !” కౌగలించుకున్నాడు.

రాజు కళ్ళు జలజల వర్షించాయి.

కొన్ని నిముషాలు కుర్రతనపు చేష్టలు - ఆ తీపి స్నేహాల గురించి మాట్లాడు కున్నారు.

పియే వచ్చి గుర్తు చేశాడు బయట చాలా మంది వెయిట్ చేస్తున్నారని- తదుపరి కార్యక్రమాల లిస్టు చదివి వెళ్ళిపోయాడు.

" సారీ అక్బర్ ! ఇంత బిజిగా ఉన్నవు. నేను వెళతాను– మళ్ళీ హైద్రాబాద్ వచ్చి కలుస్తాను."

" నీ మొహం ! వచ్చిన పని చెప్పు."

" మా బామ్మర్ధికి నీ రికమెండేషన్ కావాలి. టెస్టు పాసై, ఇంటర్వ్యూకు వచ్చాడు. బ్రోకర్లు లక్షలు లంచం అడుగుతున్నారు." అంటూ ఆ ఉద్యోగం వివరాలు అందించాడు.

" ఓకే – నా పర్సనల్ కేసు అనుకుని రికమెండ్ చేస్తాను." ఆ కాగితాలు భద్రంగా జేబులో పెట్టుకుని అడిగాడు అక్బర్.

" ఆర్యూ యూ హేపీ !"

" థ్యాంక్యూ ! అయామ్ వెరీ హ్యాపీ.. అక్బర్ జీవితం సుఖంగా ఉందా ! ఎందుకుండదు గొప్ప పలుకుబడి... అధికారం – ధనం !"

" ఫూల్ ! ఆ జీవితమే బాగుందిరా. మైనారిటీ వాడిని అని నాకు యమ్మెల్యే యిచ్చి, మినిష్టరీ యిచ్చారు. కాని, ఒకటే ఆందోళన. ఈ పదవి ఎంతకాలం ఉంటుందాని! ఎవరికీ ఏమీ చెయ్యలేక పోతున్నాను. నా మీద ఆశలు పెట్టుకున్న ప్రజలకు ఏమీ చెయ్యలేని అసహాయత... ఈ పదవి పోయింతర్వాత ఏం చెయ్యాలన్న అయోమయం. ఇది ముళ్ళ కిరీటం. ఒకే తీరిగ్గా వచ్చి కలు. ఇలా రాజకీయ క్యాంపులలో కలిస్తే ఏం మాట్లాడుకోలేం." అక్బరు సాగనంపాడు రాజును.

అక్బర్ రాజు కల్సి గోళీకాయలు ఆడుకున్నారు. ఇంటర్‌లో బెంచిమేట్లు, డిగ్రీ కూడా కల్సి చదువుకున్నారు. అప్పటి నుండీ అక్బర్ అల్లరి చిల్లరిగా రాజకీయాల్లో తిరుగుతూ ఉండేవాడు.

కొత్త పార్టీ పుట్టుకొచ్చినప్పుడు అతని అదృష్టం కల్సి వచ్చింది. మైనారిటీల తరుపున ఎవరూ దొరక్క కాస్త చదువుకున్న వాడని ఇతగాడికి సీటు యిచ్చారు. అతని అదృష్టం బాగుండి రాజకీయ గాలిలో గెలిచాడు. జిల్లాకు ప్రాతినిధ్యం యిచ్చే దశలో ఎవరూ దొరక్క మైనారిటీలు యింకెవరూ గెలవలేదు కనుక ఇతన్ని మంత్రి పదవి వరించింది.

అయినా ఇంత పదవిలో ఉండి కూడా అతను సుఖపడటం లేదన్నమాట! రాజు బాధపడ్డాడు.

బామ్మర్ధికి ఉద్యోగం వచ్చింది. సారిక మామగారు వాళ్ళు చాలా సంతోషపడ్డారు అతని ప్రయోజకత్వానికి.

కొంతకాలానికి

ఆఫీసు పనిమీద క్యాంపు కొచ్చి... పనైంతర్వాత డైరీలో ఉన్న పాత అడ్రసు పట్టుకుని వెతుక్కుంటూ వచ్చాడు గోపీని పట్టుకోవడానికి.

అప్పుడే అతను ఇంట్లోంచి బయటకు పోబోతున్నాడు. గడ్డం పెంచేశాడు కాబట్టి గుర్తు పట్టలేదు.

" ఇక్కడ – గోపీ అని ఉండాలి – మీకు తెల్సా !" రాజు

" ఓ ! రాజా ! నేనేరా గోపీని." తలుపు తీసి లోపలికి లాక్కొచ్చాడు.

" అది రెండు గదుల యిల్లయినా బ్రహ్మచారుల గదిలాగానే ఉంది. గోడకు క్యాలెండర్లు, సినిమా స్టార్ల ఫోటోలు, అమ్మాయిల బొమ్మలు, ఇల్లు మురికిగా, సర్దక, చెదిరిపడిన పేపర్లు, సిగరెట్టు ముక్కలు, అడ్డదిడ్డంగా పడేసిన బట్టలు.

" అవును గోపీ, ఇంకా పెళ్ళి చేసుకోలేదా ?!" రాజు కొంచెం ఆశ్చర్యంగా అడిగాడు.

" తెల్సుగా నీకు – మళ్ళీ అడుగుతున్నావు. నాకు పెళ్ళి అంటే సరిపోదు. అప్పుడే చెప్పానుగా బ్రహ్మచారిగా ఉండిపోతానని... అలాగే ఉన్నాను." గోపీ చెప్పాడు.

సరదాగా కబుర్లు చెప్పుకున్నారు. జ్యూస్ కలిపి యిచ్చాడు.

" భోజనానికి హోటల్‌కు పోవాల్సిందే... పద ... వెళదాం !" గోపీ లేపాడు రాజును.

" నాకు సందేహం. ఒంట్లో ఓపిక ఉంది కాబట్టి ఎంత దూరమైనా నడిచి హోటల్‌కు వెళ్ళి భోంచేస్తావు ! ఒక వేళ – అలాకాకూడదనుకో – ఏదన్నా జబ్బు చేసి కాని, ఒంట్లో ఓపిక లేకపోతే ఏం చేస్తావు!"

" మానేస్తాను."

" ఎంతకాలం మానగలవు!"

" ఖర్మ... ఎవరితో నన్నా చెప్పి క్యారియర్ తెప్పించుకుంటాను."

" కానీ నీకెవరూ లేరుగా తెచ్చివ్వడానికి"

" మూర్ఖుడా ! నాకెవరూ ఎందుకు లేరు. నేను పెళ్ళి చేసుకోలేదు అంతే. నాకంటూ భార్య – పిల్లలు లేరు. కాని స్నేహితులున్నారు. బంధువులున్నారు. ఇరుగు, పొరుగు ఉన్నారు. ఆఫీసు కోలీగులున్నారు."

" కాని, వీళ్ళంతా నీకు తోడుగా ఉండరు కదురా ! ఏదో ఒకచోట ఆగిపోయే వాళ్ళే కదురా ! ఎల్లకాలం, ఎల్లవేళలా నీకు తోడు ఉండేది భార్య–పిల్లలే కదురా!"

" పొరపాటు–ఎల్లకాలం ఎవరూ తోడు ఉండరు, ఉండలేరు. భార్య, పిల్లలైనా శ్మశానందాకా తోడు రాగలరు. ఆపైన రాలేరుగా!" గోపీ అన్నాడు బాధగా.

రాజు నిరుత్తరుడయ్యాడు.

" చూడు రాజు – నువ్వనుకుంటున్న నీవాళ్ళు ఎల్లకాలం నీతో మంచిగా ఉండలేరు.

మనిషి మధ్య చాలా మటుకున్న బంధాలు - ఆర్థికంగా ప్రభావితమవుతున్నాయి. అనురాగబంధాలకంటే - అర్థిక బంధాలే కుటుంబాలను చాలా చోట్ల నిలబెడుతున్నాయి. రెక్కలు రాగానే పిల్లలు ఎగిరిపోవడానికి కారణం యిదే ! భార్యకు వేరే దారి లేక నీతో ఉంటుంది. ఆమెకు కూడా సంపాదన ఉంటే భర్తతో ఎంతకాలం తోడుగా ఉండగలదో చెప్పలేం!" అలా తన నిశ్చితాభిప్రాయాలు చెప్పుకుంటూ పోతాడు.

" అయితే ఇలా బ్రహ్మచారిగా ఉండిపోతానంటావా! వృద్ధాప్యం గురించి నీకేం దిగులు లేదన్నమాట. ఆ వయసులో కొడుకులు- కూతుళ్ళు అండదండలు అక్కరలేదన్న మాట" నిష్ఠూరంగా అన్నాడు రాజు.

" పిచ్చి రాజు - ఈ కాలంలో ఎవరికి ఎవరు? ఎంతో మంది... కొడుకులు, కూతుళ్ళ వలన తిరస్కరించబడి వృద్ధాశ్రమాల్లో జీవితాన్ని లాగించడం లేదు."

ఇంక వీడు మారడని నిర్ణయానికి వచ్చేశాడు. " సరేలేరా ! నువ్వే కరెక్టు... బ్రహ్మచారిగా నన్నా సుఖపడు- నీ జోలికి ఎవరు రారు. నీ సంపాదన నీవే అంతా బ్యాంకులో వేసుకొని సుఖంగా ఉండు."

పెద్దగా నవ్వాడు గోపీ !

బిత్తరపోయి చూశాడు రాజు .

" ఒంటి లింగ శొంఠి కొమ్ముగాడని - అందరూ నా వంక ఆశగా చూస్తూ ఉంటారు. మా అన్నయ్యలు- తమ్ముళ్ళు- అక్కయ్యలు - చెల్లెళ్ళు అంతా ఏ అవసరం వచ్చినా డబ్బు పంపమని రాస్తూ ఉంటారు. అది వెనక్కి తిరిగి రాదని తెల్సినా పంపించాల్సి వస్తుంది. పైగా 'ఎవరున్నారురా? మేం తప్పించి' అంటూ దబాయించి గుంజుకుంటారు. ఇంక సుఖమంటావా - మీరు పడే క్షణిక సుఖాలు కూడా నాకు లేవు. పైగా బద్ధకించి యింట్లో పడుకుంటే కాఫీ - టిఫిను, భోజనం కూడా దొరకదు. పని మనుషులు లేకపోయినా, రాకపోయినా నడుం వంచి పని చేసుకోవాలి. ఏవో అనుకున్నాకాని బ్రహ్మచారి జీవితంలో కూడా సుఖం లేదురా !" వాపోయాడు గోపి.

ఆ రాత్రి రూము కొచ్చి తన కష్టాలన్నీ ఏకరువు పెట్టాడు. నిజమేననిపించింది రాజుకు. అతని జీవితం తనకంటే దుర్భరమనిపించింది.

" పోనీ ! పెళ్ళి చేసుకోరాదురా ఇప్పటికన్నా !"

" హూ ! ఈ వయసులో నాకు పిల్లనెవరిస్తారురా ! ఇచ్చినా ఆస్తిని, సంపాదనను ఆశించి యిస్తారు. దాంతో మళ్ళీ లేని పోని సమస్యలు... అసలు ఈ వయసులో ఎవరితో అడ్జెస్టు కాలేంరా ! ఈ కాయం ఇలా కాలిపోవాల్సిందే ! ఒంటరి నక్షత్రంలా రాలిపోవాల్సిందే. నా కోసం కన్నీరు కార్చే దిక్కులేక" ఏడ్చేశాడు గోపి.

రాజు ఎంత ఓదార్చినా – ఎంత సర్ది చెప్పినా బాధపడడం మానలేదు. ఫైనల్‌గా ఓ మాట చెప్పాడు.

" గోపీ ! ఎలాగూ నీకు బ్రహ్మాచర్యంలోని బాధలు తెల్సిపోయాయి. ఈ సమస్యలు పాతబడిపోయాయి. కాబట్టి కాస్త థ్రిల్‌గా ఉంటుంది. పెళ్ళి చేసుకో. అమ్మాయిలంటావా నేను వెతుకుతాను నీకోసం. పెళ్ళి సక్సెస్ అయితే సంతోషం, కాలేదనుకో ఇంతకంటే చెడిపోయిందంటూ ఏం లేదు. ఓదార్చాడు."

" సరే ! నువ్వు చెబుతున్నావు కాబట్టి అలాగే చూద్దాం ! నువ్వు మటుకు అమ్మాయి గురించి క్షుణ్ణంగా పరిశీలించి నాకు అనువుగా ఉంటుందంటేనే తీసుకురా!" భారంగా చెప్పాడు గోపి.

రాజుకు తృప్తిగా ఉంది. ఇన్నాళ్టికి ఓ మిత్రుడ్ని మార్చగలుగుతున్నాడు. ఒంటరి జీవితం నుండి జంటకు నడిపించ బోతున్నాడు. భవిష్యత్తులో ఏముందో మనకు తెలీదు. కాని వర్తమానం బాగా లేనప్పుడు మార్పుకోసం ప్రాకులాడ్డంలో తప్పు లేదుగా.

రాజుకున్న ఇంకో భ్రమ తొలగిపోయింది. బ్రహ్మాచారి జీవితం కూడా సుఖం లేనిదే ! ఎవరు సుఖపడుతున్నట్లు !

కాలచక్రం గిర్రున తిరుగుతూనే ఉంది.

ఓ రోజు సారిక ఓ వార్త మోసుకొచ్చింది.

మునిసిపల్ హైస్కూల్ కాంపౌండ్‌లో రోజూ సాయంత్రం మహాభారతం పైన ఉపన్యాసాలు యివ్వడానికి జగద్గురు శంకరస్వామీజీ వచ్చారని – ఆయన ఉపన్యాసాలు అందరిని అలరిస్తున్నాయిని... అందరూ తమ సందేహాలను తీర్చుకుంటున్నారని. ఆ ఉపన్యాసాలు వినడానికి పోదామని కోరింది.

" మహా భారతం పైన మనం కొత్తగా వినేదేముంది. నేను రాను, కావాలంటే నువ్వు పోయిరా !" కరాఖండిగా చెప్పేశాడు.

గత్యంతరం లేక సారిక ఇరుగు పొరుగుతో కల్సిపోయి వచ్చేది. ఆమె ఆ ఉపన్యాసాలలో లీనమైపోయేది. అంతకు మునుపు ఉన్న చిన్నా, పెద్దా సందేహాలు పటాపంచలై పోయాయి.

మన దేశ సంస్కృతి చరిత్ర ఇంత గొప్పదని తెల్సుకుని ఉప్పొంగిపోయింది.

ఆ స్వామీజీ ఒక సందేహం తీర్చడానికి దృష్టాంతాలు ఎక్కడెక్కడివో పురాణాల లోంచి కూడా పట్టుకొచ్చేవారు. ఏతావాతా వారికున్న విజ్ఞానం అపారం!

ఇంకో రోజు బాంబులాంటి వార్త పేల్చింది సారిక.

" ఏవండోయ్ ! మనం అనుకున్నట్లు ఆయన కేవలం ఉపన్యాసకుడే కాదుట –

గొప్ప స్వామీజీట ! ఉదయం పూట భక్తుల సమస్యలు విని వాటికి పరిష్కారాలు చెబుతున్నారట. ఆయనకు భూత భవిష్యత్తు కూడా తెలుసుట!"

" సారికా ! నువ్వు కనిపించిన ప్రతి చిల్లర రాయికి మొక్కుతావు. ప్రతి స్వామిని నమ్ముతావు. ఎంతమంది స్వాములు నీ దగ్గర డబ్బులు స్వాహా చెయ్యలేదు." విసుక్కున్నాడు.

" తప్పు - తప్పు కళ్ళు పోతాయి. స్వాములను - పాములను తడుముకోవాకండి. నమ్మకం లేకపోతే గమ్మున ఊరుకోండి. ఊరికే నిందవేసినా, విమర్శించినా ఒంటికి మంచిది కాదు. స్వాములు కొందరు సర్వ సమర్థులుగా ఉంటారు. ఇస్తే వరం - పెడితే శాపం!" సారిక చెంపలేసుకుంది.

రాజు కూడా చెంపలేసుకున్నాడు. తనకెందుకు - ఎవరి నమ్మకాలు వాళ్ళవి - వాళ్ళేమీ తమ దగ్గరకు రమ్మని పిలవడం లేదుగా !

మన బాధల కొద్దీ మనం వాళ్ళను దర్శించుకుంటున్నాం ! ఏ పుట్టలో ఏ పాముందో ! మనకెందుకులే అని ఊరుకున్నాడు.

సారిక అతన్ని పిలవకుండా తనే వెళ్ళింది ఆ స్వామి దగ్గరికి. " ఏమ్మా ! ఇలా వచ్చావు?" చిరునవ్వుతో పలకరించారు.

" స్వామీ - మీకు తెలియంది ఏమి ఉంది? నా సంసార బాధలు నాకున్నాయి. ఆ బాధా విముక్తురాల్ని చేయండి" సారిక.

" ప్రారబ్ధ కర్మ అనుభవించక తప్పదు. కాకపోతే పూజలు, వ్రతాలు చేస్తే ఆ బాధల తీవ్రత తగ్గుతుంది." చెప్పాడు.

" అదెలా స్వామీ ?"

" బయట వర్షం పడుతున్నది. నువ్వు తప్పకుండా బయటకు వెళ్ళాలి. పనిమీద వెళితే తడిసి జలుబు చేసి, జబ్బుపడి నానా బాధపడతావు. అదే గొడుగు తీసుకుని వెళ్ళేవనుకో కొంతవరకు మేలు జరుగుతుంది. అలాగే నీ కర్మ అనుభవించడంలో - ఈ వ్రతాలు - పూజలు గొడుగులాగా పనిచేసి నీ బాధల్ని కొంతశాతం ఉపశమింపచేస్తాయి." వివరించారు.

" అది కూడా నిష్టగా చేసుకోలేని భక్తిహీనురాల్ని. మీరే కాపాడండి" వేడుకొంది.

" సరే ! నేనొకటి యిస్తాను- ఆరునెల్లు డబ్బాలో వేసి పూజా మందిరంలో ఉంచుకో!" అంటూ చేతులు గాల్లోకి ఊపి నిమ్మకాయ సృష్టించి ఆమెకిచ్చారు.

ఆమె భక్తితో కళ్ళకద్దుకుని - ఇంటికి తెచ్చుకుంది.

ఇదంతా విని రాజుకు కుతూహలం కలిగింది.

ఓపిక చేసుకుని ఓ ఉదయం వెళ్ళాడు. అప్పటికే చాలా మంది ఉన్నారు. అందరికీ

సలహాలు - సమాధానాలు యిస్తున్నారు. రాజువంక ఎందుకొచ్చావన్నట్లు చూశారు.

" స్వామి నాదొక సందేహం !"

" చెప్పు..."

" భగవద్గీతలో శ్రీ కృష్ణ భగవానుడు నా రూపాన్ని ఎవ్వరూ చూడలేరు అని చెప్పారు కదా ! కాని చరిత్రలో మనకు చాలామంది భక్తులకు భగవంతుడు కనిపించనట్లు సాక్షాధారాలున్నాయి కదా!"

" ఒకటి చెప్పు ."

" భక్త తుకారాంకు... మీరాబాయికి - ఇంకా చాలామంది పాండురంగ విఠలుని భక్తులకు - భక్తరాందాసుకు - తులసిదాసుకు ఇంకా ఇంకా ..." రాజు తడబడ్డాడు.

" చాలు... చాలు... మీలో ఎవరైనా ఈ సందేహం తీర్చగలరా ! ఇతను అడుగుతున్న దేమంటే గీతలో స్వయంగా కృష్ణుడు చెప్పింది అబద్ధం కదాని ! భగవంతుడు ఈ భక్తులందరకు కనిపిస్తే నన్నెవరు చూడలేరు అని ఆయన పలికింది అసత్యం కదాని. ఒకవేళ వీళ్ళు చూశామంటే వీళ్ళు అబద్ధం చెబుతున్నట్లా..."

ఒక్కసారి సభ నిశ్శబ్దమై పోయింది.

" భేష్ ! మంచి ప్రశ్న వేశావు. ఇన్నాళ్ళుగా నాకెవరు యిటువంటి ప్రశ్న వెయ్యలేదు.... అందుకే మనం గీతను జాగ్రత్తగా చదవాలి. భగవానుడు చెప్పిందేమిటి- ఈ చర్మ చక్షువులతో నా రూపాన్ని చూడలేవన్నాడు..."

" కాని వీళ్ళంతా - అదే మీరాబాయి-తుకారాం చూశారుగా" రాజు ఆత్రంగా అన్నాడు.

" అదీ సంగతి... కృష్ణుడు చెప్పింది నా రూపాన్ని అని.. అంటే ఆయన యొక్క విశ్వరూపాన్ని - అర్జునుడు కూడా ఎలా చూడగలిగాడు. ఆయన ప్రసాదించిన దివ్య నేత్రాలతోనే ! కాని మీరు అనుకొనే భక్తులు చూసింది విశ్వరూపాన్ని కాదు. వారు ఆరాధించిన ఒక మాయా మానుష రూపాన్ని-" వివరించాడు.

అలా ఆయన అనర్గళంగా చెప్పుకుంటూ పోయాడు.

కాలాతీతమైందని లేవబోయారు. అప్పుడు రాజు చెప్పాడు.

" స్వామి నాకు సుఖం లేదు స్వామి ! సుఖం కావాలి!"

" సుఖం ! దానికోసం వెతికావా!"

" ఆ ! వెతుకుతూనే ఉన్నాను కాని నాకు సంతృప్తి కలిగించే సుఖం కనిపించలేదు."

" కాంతా, కనకం, కీర్తిలో సుఖం లేదు. ఈ సంసారంలో సుఖం లేదు... అది నేను చెప్పింది కాదు - కృష్ణుడే చెప్పాడు స్వయంగా."

" మరి ఎక్కడుంది !"

" ఈ మాయా జగత్తులలో ఎక్కడా లేదు - లభించదు. అలా లభించింది అనుకున్నా అది ఒట్టి భ్రమ. ఆ ఆనందం శాశ్వతం కాదు. మబ్బులో ఉన్న నీరుతో దాహం తీరదు. కాబట్టి ఈ మాయను అధిగమిస్తే మనకు సుఖం లభిస్తుంది." చెప్పాడు స్వామీజీ.

" మరి ఆ మాయను ఎలా ఛేదించాలి?" బుర్ర గోక్కుంటూ అడిగాడు.

" అది పెద్ద మహర్షులకే సాధ్యం కాలేదు కదా - నా బోటి సామాన్యులకు ఎలా సాధ్యం ?" రాజు ప్రశ్న.

" కృష్ణ భగవాన్ ఆ విషయాన్ని అంగీకరించారు. ఈ మాయను జయించడం కష్టసాధ్యం ... అసంభవం అయితే కాదు. ఎవరైతే మనసావాచా కర్మణా నన్నే నమ్ముకుంటారో వారు ఈ మాయను అధిగమించగలరు అని భగవంతుడు చెప్పాడు." స్వామీజీ వివరించారు చాలా సేపు.

" కాని.. దేవుడు ఉన్నాడు ఉన్నాడంటారు ! ఉంటే మనకు కనిపించాలి కదా!" రాజు.

" దాని కోసం నువ్వు చేసిన కృషి ఏమిటి?"

" ఐదేళ్ళుగా పూజలు చేస్తున్నాను.. ధ్యానం చేస్తున్నాను" రాజు సిగ్గుపడుతూ చెప్పాడు.

" డిగ్రీ మీరు ఎన్ని సంవత్సరాలలో పాసయ్యారు?"

" మూడేళ్ళలో -" ఠపీమని చెప్పాడు రాజు.

" ఆహా ! ఇంటర్ కాకుండా డిగ్రీ అయ్యారా? టెన్త్ కాకుండా ఇంటర్ పూర్తి చేశారా! యల్‌కేజీ నుండి చదువుకాకుండానే టెన్త్ పాసయ్యారా! అంటే మూడు నాలుగవ ఏట మీరు అక్షరాలకు శ్రీకారం చుడితే - డిగ్రీ తెచ్చుకునే దానికి ఇరవై సంవత్సరాలు పైన పట్టింది. అంటే కనీసం పదహారు - పదిహేడేళ్ళ కృషి చేస్తేనే కాని - డిగ్రీ అందుకోలేక పోయారు. అది కూడా ఎటువంటిది- ఉదర పోషణార్థం డిగ్రీ - దాని సారమంతా కాదు... కేవలం పరీక్షలు పాసుకావడం వరకే! ఇంత అల్పమైన డిగ్రీ పాసుకావడానికి పదిహేడేళ్ళు పడితే - అనంతమైన భగవంతుడి కటాక్షం ఐదేళ్ళల్లో సాధారణ పూజలతో అందుకోగలమా- ఆలోచించండి".

అందరూ మౌనం వహించారు. ఇంత చిన్న విషయం తమకు తట్టనందుకు కొందరు విచారించారు కూడా.

కొన్ని రోజుల తర్వాత రాజు స్వామీజీ పాదాలు పట్టుకొని వదలలేదు. కన్నీటితో ఆయన పాదాలకు అభిషేకం చేశాడు ఆయన ఎంత వారిస్తున్నా !

" రాజు ! ఏం కావాలి ?" శాంతంగా అడిగారు.

" నాకు సుఖం కావాలి. శాంతి కావాలి. చాలా ఏళ్ళుగా నా మనస్సు అశాంతంగా ఉండి పోయింది. ఏదో కొరత, ఏదో కావాలి... అది ఏదో అర్థం కావడం లేదు... ఏ పని చేసినా ఏదో లోటు - మనసు వశం తప్పుతుంది.. అంతా క్షణికమనిపించి దేనిలోనూ తృప్తి పొందలేక పోతున్నాను. మీరు సామాన్యులు కారు - నన్ను అనుగ్రహించండి." అని వేడుకున్నాడు.

జగద్గురు శంకరస్వామీజీ చిరునవ్వుతో తన అభయ హస్తాన్ని రాజు శిరస్సు మీద ఉంచారు.

అంతే ! రాజులోకి ఎన్నో వేలవాట్ల విద్యుచ్ఛక్తి ప్రవహించింది. ఆ షాక్ తట్టుకోలేక స్మృతి తప్పి పడిపోయాడు.

" అతన్ని లేపద్దు..." అని చెప్పి వెళ్ళిపోయారు.

కొన్ని గంటల తర్వాత రాజుకు మెలకువ వచ్చింది. ఒళ్ళంతా ఒకటే పులకరింత. గుండెల్లో జలదరింపు. నర నరం కొత్త శక్తితో త్రుళ్ళిపడుతున్నది. ఎంతో ఆనందం! ఎంతో పారవశ్యం!

ఆ అలౌకిక ఆనందంలో కొన్ని రోజులుండిపోయాడు. ఏ పని చేస్తున్నా ఆ ఆనందం విడిచి పోవడం లేదు.

జీవితంలో మొదటిసారిగా అలౌకిక సుఖం అంటే ఏమిటో అర్థమైంది. దేన్ని చూసినా కొత్త కొత్తగా కనిపిస్తున్నది. అందరూ భగవంతుని ప్రతిరూపాలన్నట్లు అనిపిస్తున్నది.

ఆ పారవశ్యం తగ్గిన తరువాత మళ్ళీ స్వామీజీని కలిసి, ఆ అనుభవాన్ని పునః ప్రసాదించమని కోరుకున్నాడు.

" తప్పు.. నీ జీవితం వ్యర్థమై పోయిందని నీకు ఆ అనుభూతిని యిచ్చాను. దాన్ని నువ్వే సాధన ద్వారా అందుకోవాలి!" స్వామీజీ చిరునవ్వుతో తిరస్కరించారు.

" కాని నేను అల్పుడ్ని! సాధన కూడా చేసుకోలేని అసమర్థుడిని. నా శేషజీవితం కూడా వృథా అయిపోతుంది." ఏడ్చాడు.

జాలి పడ్డారు స్వామీజీ.

" లేదు... నేను గురూపదేశం యిస్తాను. దాన్ని నిరంతరం కాకపోయినా నియమబద్ధంగా రోజూ చేసుకుంటూ ఉంటే - అతి తొందరలో నీకు ఏకాగ్రత కుదిరి... భగవంతుని అందుకునే మార్గంలో పయనిస్తావు." అంటూ చెప్పి, అతని చెవిలో ఏదో ఉపదేశించారు ఓ మంచి రోజున. అలా నడుచుకోమని ఆదేశించారు.

రాజు ఇప్పుడు ప్రాతఃకాలం లేచి స్వామీజీ యిచ్చిన మంత్రాలను జపిస్తున్నాడు.

ఇప్పుడు రాజుకు సుఖం ఎక్కడ ఉంది. ఎక్కడ దొరుకుతుంది అన్న సందేహము లేదు. ఈ దేహంతోనే అలౌకిక సుఖం పొందవచ్చన్న నమ్మకం కుదిరింది. గడ్డిపూవు మంచు బిందువులను స్వీకరించినట్లు ఆ విశ్వ శక్తి కరుణా కిరణాలను రాజు స్వీకరించడానికి పూనుకున్నాడు.

" ఈ లోకంలో మూడు రకాల ఆనందాలున్నాయని శంకరాచార్యులు చెప్పారు. ఒకటి విషయానందం- రెండు భజనానందం - మూడు బ్రహ్మానందం."

" అంటే ఏమిటి స్వామి." చెవులప్పగించి వింటున్న రాజు ప్రశ్నించాడు ఏకాగ్రతతో.

" విషయానందం క్షణిక సుఖాన్నిస్తుంది. విషయలోలుడైనవాడు తాత్కాలికంగా సుఖపడ్డాను అనుకుంటాడు... కాని, ఆ సుఖం చివరికి దుఃఖానికి దారి తీస్తుంది. ఉదాహరణకు తాగుబోతుకు తాగినంతసేపు బాగుంటుంది... మత్తు దిగగానే నరాలు లాగుతూ ఉంటాయి, తలనెప్పి వస్తుంది. మళ్ళీ తాగాలనిపిస్తుంది. అలా తాగుతూ పోతే చివరికి అతని లివరు, కిడ్నీలు, శరీరం మొత్తం క్షీణించి నాశనమై పోతుంది. కాబట్టి విషయానందం చివరికి దుఃఖాన్ని యిస్తుంది."

"..... ..... ..... ....."

" ఇక భజనానందం - అంటే స్మరణ - మననం - దేవుని గురించి పూజలు - అలాంటి మిగతా మంచి పనులు - చేస్తున్నంతసేపు ఆనందాన్ని కలిగిస్తాయి. మానిన తరువాత దుఃఖాన్ని కలిగించవు. ఒక బ్రహ్మానందం వైపు బాటలేస్తాయి. చాలామంది భజనానందం కోసం కూడా ప్రయత్నించడం లేదు. కేవలం విషయానందం లోనే కొట్టుకుపోతున్నారు."

" బ్రహ్మానందం మనకు కలుగుతుందా!"

" అసంభవమైతే కాదు - కాని మిక్కిలి కష్టం... ఇక బ్రహ్మానందం పొందితే ఆ ఆనందం శాశ్వతం - నిరంతరం- అది నిజమైన సుఖం !" స్వామీజీ చెప్పారు.

" స్వామీ ... మీరాక నా పూర్వజన్మ పుణ్యఫలం. నేను భజనానందం పొందడానికి ప్రయత్నిస్తాను. ఈ జీవితానికిది చాలు..." అంటూ స్వామీజీ పాదాలపైన వాలిపోయాడు.

శ్రీ జగద్గురు శంకర స్వామీజీ చిరునవ్వుతో అతని శిరస్సు నిమిరారు.

- ఆంధ్రప్రభ 25.2.2009